క్లుప్తంగా

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న మధు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మిక సంస్కరణల పేరుతో కార్మిక సంఘాలను ఎత్తివేసి కార్మిక లోకానికి అన్యాయం చేస్తున్నారని దీన్ని తిప్పికొట్టాలంటే కార్మిక లందరూ ఐక్యంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కూరగాయల సెక్షన్ 22వ మహాసభ నిర్వహించారు. పది సంవత్సరాలుగా ప్రత్యేక హోదా కోసం సీపీఐ పోరాడుతూ ఉందన్నారు. గడచిన ఐదు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల ఊబిలో మునిగిపోయిందన్నారు. ఏ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అప్పులు తప్పని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రత్యేక హోదా తోనే సాధ్యమని అన్ని రాజకీయ పార్టీలు కలసి హోదా సాధించాలన్నారు. ఇప్పుడు కేంద్రంలో కొనసాగుతున్నది బీజేపీ సర్కారు కాదని ఎన్డీఏ సర్కార్ అని గుర్తు చేశారు. బీహార్ అసెంబ్లీ ప్రత్యేక హోదా కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఈ దిశగా ఏపీ కూడా ముందుకు వెళ్లాలన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీ కొండలరావు, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రమేష్ (ఫైల్)

కడియం: కడియపుసావరం గ్రామానికి చెందిన దిడ్ల రమేష్ (29) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ మల్లెతోట సాగు చేయడంతో పాటు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఉపాధి పొందుతుంటాడు. ఎప్పటి లాగే గ్రామంలో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి, కార్యక్రమం అనంతరం సహాయకుడు ఎం.రాజుతో కలిసి తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా అవుతున్న వైరును గమనించక చుట్టే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజుకు సైతం విద్యుత్ షాక్ తగిలినా అంతగా గాయపడలేదు. కాగా స్థానికులు రమేష్‌ను కడియం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌కు భార్య చిన్ని, కుమార్తె అక్షయ, కుమారుడు సందీప్ ఉన్నారు.

సకాలంలో ఏర్పాటు చేయలేదని ఆగ్రహం



పంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం: ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద సకాలంలో పంపు హౌస్ ఏర్పాటు చేయకపోవడంపై ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవ చానల్‌కు వరద నీరు పోటెత్తడంతో ధవళేశ్వరం సాయిబాబా గుడి పక్కన ఆవ ఛానల్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పంపింగ్ హౌస్‌ను ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. సకాలంలో అధికారులు పంపు హౌస్ ఏర్పాటు చేయకపోవడం వల్ల రామకృష్ణనగర్, సావిత్రినగర్, నేతాజీ నగర్ ప్రాంతాలు జలమయం అయ్యాయని నగరపాలక సంస్థ అధికారులపై గోరంట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

చనిపోయి ఇద్దరికి నేత్రదానం చేసిన బాలుడు



నేత్రదానం చేసిన సాయి గణేష్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆ బాలుడు చనిపోయి ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపాడు. 13 ఏళ్ల కేవీవీ సాయిగణేష్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. రామచంద్రపురం మండలం ఊడుమూడి గ్రామానికి చెందిన సాయిగణేష్ ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ఐదు నెలల క్రితం ఆ బాలుడికి తలలో రక్త కణితి ఏర్పడింది. దీంతో బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన మేనమామ సోమేశ్వరరావు ఇంటిలో ఉండి రాజమహేంద్రవరంలోని ఒక న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే సాయిగణేష్ కొన్ని గంటల్లో మృతిచెందుతాడు అని వైద్యులు తల్లిదండ్రులకు చెప్పారు. వైద్యులు చెప్పిన విధంగానే ఆ బాలుడు మృతిచెందాడు. బాలుడు మేనమామ సోమేశ్వరరావు చొరవతో పుట్టెడు దుఃఖంలోను తల్లిదండ్రులు సాయిగణేష్ రెండు నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. నిడదవోలులోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్ట్యూట్‌కు సాయిగణేష్ నేత్రాలను అందించారు.

పేరుకే జాతీయ రహదారి

- నిర్వహణలో అడుగడుగునా నిర్లక్ష్యం
- ఎక్కడికక్కడే రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- రోడ్డు దెబ్బతినడంతో పాటు, ప్రయాణికులకు పొంచి ఉన్న ప్రమాదం

కడియం: జాతీయ రహదారి.. వేగవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు నిర్దేశించిన రోడ్డు. ఈ రోడ్డు మీద తగినంత వేగంగా ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు తగిన ఏర్పాట్లు రోడ్డు వెంబడి సంబంధిత సంస్థలు చేస్తుంటాయి. రోడ్ల మరమ్మతులతో పాటు, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై మొక్కల పెంపకం, పిచ్చిమొక్కల తొలగింపు, రోడ్డు మీద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టడం తదితర చర్యలను నిర్వాహణ సంస్థలు పర్యవేక్షిస్తుంటాయి. ఇందుకు తగిన సిబ్బందిని కూడా నియమిస్తారు. అయితే పలు రకాల నిర్వహణ పనులు కొంతవరకు సక్రమంగానే జరుగుతున్నప్పటికీ కొన్ని రకాల పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి. డివైడర్ మధ్యలో పిచ్చిమొక్కల తొలగింపుపై ఉన్న శ్రద్ధ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పట్ల చూపడం లేదని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. నియోజకవర్గం పరిధిలో మోరంపూడి నుంచి పొట్టిలంక వరకు సుమారు పదిహేను కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారి ఉంది. రావుల పాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వచ్చే



కడియపులంక వద్ద రోడ్డుకు ఎడమ పక్క పెరిగిన పిచ్చిమొక్కలు

జాతీయ రహదారి వెంబడి రోడ్డుకు ఎడమ పక్కన పిచ్చిమొక్కలను సక్రమంగా తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీని కారణంగా రోడ్డు మీదుగా పారుతున్న వర్షపు నీరు ఎడమ చివరకు వచ్చేసరికి నిలిచిపోతోంది. దీంతో వర్షమొస్తే సాధారణ రోడ్ల మాదిరిగానే జాతీయ రహదారిపై కూడా ఎక్కడికక్కడే నీటి గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇలా నీరు నిల్వ ఉన్నచోట్ల బురద కూడా చేరి వాహనాలు జారుతున్నాయంటున్నారు. అంతేకాకుండా రోడ్డు త్వరగా దెబ్బతింటోందని చెబుతున్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం

వాస్తవానికి హైవే వెంబడి ఇలా నీరు నిలిచిపోకుండా ఎక్కడికక్కడే పక్కా ఏర్పాట్లు ఉంటాయి. కానీ వాటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని వాటిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు చెబుతున్నారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక వద్ద ఏటా వర్షాకాలంలో హైవే పైనే నీరు నిలిచిపోతుంది. ఇక్కడే ఇసుక ర్యాంపు నుంచి వచ్చే వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవలే మీడియాలో వార్తలు రావడంతో తక్షణం ముంపు నీరు బయటకు పోయేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలో సిల్టు తొలగించారు. దీంతో అక్కడ నీరు నిలిచి ఉండడం లేదు. నియోజకవర్గం పరిధిలో గల జాతీయ రహదారిపైనే ఐదు వరకు బ్లాక్‌స్పాట్‌లు కూడా ఉన్నాయి. ఈ ఐదు ప్రాంతాల్లోనూ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. కేవలం డివైడర్ మధ్యలోనే కాకుండా రోడ్డుకు ఇరువైపులా కూడా జంగిల్ క్లియరెన్స్ సక్రమంగా చేయాలని కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్ పూడుకుపోవడంతో హైవేపై నిలిచిపోయిన వర్షపునీరు



హైవే వెంబడి దర్శనమిస్తున్న నీటి గుంతలు

హైవేపై కూడా నీటి గుంతలా..

జాతీయ రహదారిపై కూడా నీటి గుంతలు కన్పిస్తున్నాయి. వర్షపు నీరు సక్రమంగా కిందికి వెళ్లే ఏర్పాట్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతోనే ఇలా ఏర్పడుతున్నాయి. వీటి కారణంగా వాహనాలు జారి అదుపు తప్పి, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలి. – జి.రాజు, వేమగిరి

డివైడర్‌పైనే చేస్తున్నారు

పిచ్చిమొక్కల తొలగింపు డివైడర్ మధ్యలోనే చేస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా చేయడం లేదు. దీంతో ఒక పక్క మొక్కలు పెరిగిపోయాయి. వీటిని తొలగించకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్డు మీదే నిలిచిపోతోంది.

–కే. సత్యనారాయణ, మడికి

బ్రాండ్ అంబాసిడర్‌గా దుర్గా ఈష



ఈషను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: రాబోయే పుష్కరాలకు రాజమహేంద్రవరం బ్రాండ్ అంబాసిడర్‌గా బాడ్మింటన్ జూనియర్ చాంపియన్ షిప్‌నకు ఎంపికైన దుర్గా ఈషను ప్రకటిస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నారాయణపురంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో బ్యాడ్మింటన్ అండర్- 17 డబుల్ విభాగంలో ఏషియన్ జూనియర్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన కె.దుర్గా ఈష అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమాన్నికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దుర్గా ఈష మాట్లాడుతూ 2028లో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనాలనే లక్ష్యంతో బ్యాడ్మింటన్ సాధన చేస్తున్నట్టు తెలిపింది. ఆమెకు ట్రిప్స్ స్కూల్ నుంచి రూ.50 వేల చెక్కును అందజేశారు. కేశవభట్ల ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక ఆమెను సత్కరించారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి



బహుమతులు అందజేసిన విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తామని రాజమహేంద్రి స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్, మున్సిపల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీ.కే.విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలో మున్సిపల్ కాలనీ గ్రౌండ్‌లో 45 రోజులుగా నిర్వహించిన మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ సీజన్-11 పోటీల విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో అత్యుత్తమ ప్రదర్శనను ప్రదర్శించిన క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మున్సిపల్ కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా తయారు చేసుకోవడం వల్ల ఇక్కడ మంచి గ్రౌండ్ ఏర్పడిందన్నారు. ప్రతీ ఒక్కరూ కులమత వర్గాలకు అతీతంగా మైదానాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజలుతమ ఆరోగ్యాలను జాగ్రత్తగా కాపాడుకుంటున్నారని అంటూ క్రీడల వలన ప్రతి మనిషిలో ఫిట్నెస్ పెరుగుతుందని తద్వారా రోగాలు కూడా రాకుండా ఉంటాయని అన్నారు. చెడు వ్యసనాలకు కూడా దూరంగా ఉంటామని అన్నారు. విజేతలుగా నిలిచిన పండు రిస్కీ లెవెన్ టీంకి విన్నర్ ట్రోఫీని, మదర్స్ లెవెన్ టీంకి రన్నర్ ట్రోఫీని, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్ బహుమతులను అందజేశారు. బూసి వజ్రనాథ్, ఎండి ఆబిద్, ఎండి వజీల్, ఎండి సమ్మద్, ఎండి ఫాజిల్, గోవింద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక

– కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో నగరంలో పోలీసు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఏర్పాటు చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రకటించారు. ఆదివారం నగర పాలక సంస్థ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ పూర్తి నియంత్రణ నేపథ్యంలో క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టామన్నారు. అందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఆక్రమణ తొలగింపునకు సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 2027లో రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం ఆమోదించిన ప్లాన్‌ను అనుసరించి నిర్మాణాలు ఉండాలని, రహదారులను ఆక్రమణ చేసి చేపట్టిన నిర్మాణాలను తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆటోలు, వాహనాలు నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

ఎందరో నిరాశ్రయులకు వసతి



నిరాశ్రయులకు వస్తువులు అందజేసిన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: పలు సమస్యలతో ఇల్లు విడిచి పట్టణ ప్రాంతాలకు వచ్చే వారికి నివాసం కల్పించడంలో పట్టణ నిరాశ్రయుల కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపైన, అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల కింద నివాసం ఉంటున్న వారితో మాట్లాడి వారిని పట్టణ నిరాశ్రయ కేంద్రానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. తొమ్మిది సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ అనేక వందల మంది నిరాశ్రయులకు మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా ఆధ్వర్యంలో కంబాల చెరువు వద్ద నిర్వహిస్తున్న కేంద్రంలో వసతి కల్పిస్తున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నిరాశ్రయులకు ఉచిత వసతి, భోజనం ఏర్పాటు చేస్తోందన్నారు. చిన్నచిన్న కుటుంబ తగాదాల వల్ల, సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేని వారు చిన్న చిన్న మానసిక సమస్యలతో రోడ్డున పడుతున్నారని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబ సభ్యుల నిరాదరణకు ముఖ్యంగా సంపాదన లేని మగవారు ఇక కుటుంబానికి అనవసరం అనుకునే ధోరణి ఎక్కువైనట్టు నిరాశ్రయులతో మాట్లాడుతున్నప్పుడు తెలుస్తోందన్నారు. నిరాశ్రయులను చేర్చుకున్న తర్వాత వారికి కౌన్సెలింగ్ నిర్వహించి తిరిగి వారి స్వగ్రామాలకు పంపుతున్నామన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంకి చెందిన శ్రీధర్, గుంటూరు శ్రీను, జడ్చర్ల కి చెందిన శ్రీనివాస్, పంగిడి ఏడుకొండలు, ఖమ్మం, అప్పారావులకు నిరాశ్రయుల కేంద్రంలో వసతి కల్పించడంతోపాటు వారికి కావలసిన దుస్తులు, దుప్పట్లు, మంచాలు, కాస్మెటిక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ ఇలియాసుద్దీన్, హరికృష్ణ జగదీష్, శ్రీనివాస్ ,సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

పెరిగిన ముంపు

- బొమ్మూరు, హుకుంపేటలలో వీధుల్లోకి చేరిన వరద నీరు
- హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు మూసివేత

రాజమహేంద్రవరం రూరల్ గోదావరి వరద ప్రవాహంతో పాటు, అధిక వర్షాల వల్ల రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో గత కొద్దిరోజులుగా బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం లేచేసరికి బొమ్మూరు నేతాజీనగర్‌లోని వీధులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ముంపులోనే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివలన ఎటువంటి వ్యాధులు ప్రబలతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. హుకుంపేట గ్రామంలో జాతీయ రహదారి నుంచి తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డుతో పాటు, రామకృష్ణనగర్ వీధులు పూర్తిగా మునిగిపోయాయి. ఇక అధికారులు చేసేది లేక తూర్పు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిని పూర్తిగా మూసివేసి రాకపోకలు జరగకుండా చర్యలు చేపట్టారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హుకుంపేట ప్రాంతాన్ని డీఎల్‌పీవో నాగలత, ఇతర అధికారులతో పరిశీలించారు.



హుకుంపేటలో మూసివేసిన తూర్పు రైల్వేస్టేషన్ రహదారి

రాజా యోనాకు కళారత్న జాతీయ పురస్కారం

హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రదానం



హర్యానా గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా కళారత్న జాతీయ పురస్కారం అందుకుంటున్న రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: ఫిలాంత్రోఫిక్ సొసైటీ అఫ్ ఇండియా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాషా, సంస్కృతి, సంప్రదాయాల కోసం కృషి చేస్తున్నందుకుగాను అద్దంకి రాజా యోనాకు ప్రతిష్టాత్మక కళారత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని ఆయనకు ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఉదయం అందించారు. మాతృభాషా, సాంస్కృతిక, సామాజిక, సాహిత్యరంగాల్లో 2016వ సంవత్సరం నుంచి ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా దేశ, విదేశాల్లో ఎన్నో కార్యక్రమాలు చేసి ఎంతోమంది విభిన్న రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సాహించి వారి సేవలను భావితరాలకు తెలిసేలా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించినందుకు ఈ పురస్కారాన్ని అందించారు. నన్నయ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ భాగస్వామ్యంతోను మలేషియా, దుబాయ్, థాయ్‌ల్యాండ్ దేశాలలోని ప్రవాస భారతీయ సంఘాలతో కలసి చేసిన కార్యక్రమాలను గుర్తించి తెలుగు రాష్ట్రాలలో నన్ను ఈ పురస్కారానికి ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఫౌండర్ రొయ్యూరు శేష సాయి ఎంపిక చేసి జ్ఞాపిక, మెడల్, ఇచ్చి ఘనంగా సత్కరించారని రాజా యోనా తెలిపారు.

వరదను చూసేందుకు పోటెత్తిన జనం



రద్దీగా మారిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరిని చూసేందుకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. గత వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి ఆదివారం రెండవ ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున కాటన్ బ్యారేజీకి తరలి వచ్చారు. ఆదివారం కావడంతో కుటుంబాలతో సహ పెద్ద ఎత్తున కాటన్ బ్యారేజీ సందర్శనకు వచ్చారు. బ్యారేజీ రోడ్డు కార్లు, మోటారు సైకిళ్లతో కిక్కిరిసింది. ఉగ్ర గోదావరితో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఆసక్తి చూపారు. అధిక సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో పోలీసులు అదనపు బందోబస్తును ఏర్పాటు చేశారు.

హోం మంత్రి అనితను కలిసిన ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాకు విచ్చేసిన హోం మంత్రి వంగలపూడి అనితను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదివారం నిడదవోలులో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాకు విచ్చేసిన ఆమెను ఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతలపై ఆమెకు వివరించారు.



మంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

మొక్కలు నాటిన వలంటీర్లు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, తదితరులు

కంబాల చెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన వందమందికి పైగా వలంటీర్లు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు, నాయకులు స్వచ్ఛభారత్ పక్వాడ, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆదిత్య సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవిచౌక్ లోని సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న పశువుల వైద్యశాలలో ఆదివారం కార్యక్రమం జరిగింది. ప్లాస్టిక్ కవర్లు ఏరి, వ్యర్థ పదార్థాలను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరచారు. 12 అడుగుల 20 మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ మాట్లాడారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎస్.కె.ఎన్. రెహమాన్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు డాక్టర్ గోలి రామారావు, కె.సుధాకర్ పట్నాయక్, పి.వి.ఎస్.కృష్ణారావు, చందనరాజు పాల్గొన్నారు.

ఇబ్బందులు పడుతున్నాం కాపాడండి



మోకాలు లోతు నీటిలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాల కారణంగా నగరంలో 45 డివిజన్‌లో ఇందిరానగర్ కాలనీ జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం కాపాడాలంటూ కాలనీకి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షంతో డ్రైనేజీలు పొంగి పొర్లి మురికినీరు ఇళ్లల్లోకి ప్రవేశించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆదివారం తెలిపారు. వీధుల్లో మోకాలు లోతు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. విషసర్పాలు తాండవించడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళలో బయటకు రావాలంటేనే భయపడిపోయే పరిస్థితిని నెలకొందని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మానవత్వంతో తమ సమస్యలను పట్టించుకోవాలని మహిళలు కోరుతున్నారు.

అవధాన బ్రహ్మలు తిరుపతి కవులు

ప్రకాశం నగర్ : అవధానాలతో తెలుగు దేశమంతా జైత్రయాత్ర సాగించిన అవధాన బ్రహ్మలు తిరుపతి వెంకటకవులు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కళాగౌతమి ఆధ్వర్యంలో స్థానిక నృత్య కళాక్షేత్రంలో తిరుపతి వెంకటకవులపై సభ జరిగింది. సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన కళాగౌతమి వ్యవస్థాపకులు మూర్తి మాట్లాడుతూ, తిరుపతి కవులు వంద సంస్కృత, తెలుగు గ్రంథాలు, నాటకాలు, అనువాద గ్రంథాలను రచించారని తెలిపారు. కళాగౌతమి అధ్యక్షుడు సంజీవరావు, నీలకంఠరావు, సప్పా దుర్గాప్రసాద్ ప్రసంగించారు.

ఉచిత వివాహ పరిచయ వేదిక సక్సెస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక గేదెల సూకరాజు కల్యాణ మంటపంలో ఆదివారం నిర్వహించిన శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదిక విజయవంతమైనట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు చెప్పారు. యువకుల పరిచయ దరఖాస్తులు 177, అమ్మాయిలవి 105 వచ్చాయని తెలిపారు. రామారావు మాట్లాడుతూ 2007 నుంచి ఏడాదికి రెండుసార్లు ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని వివరించారు. నవంబర్ 3 వ తేదీన రాజమహేంద్రవరంలో మెగా శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఏలూరు శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కోడి దుర్గారావు, ముఖ్య అతిథి వాసంశెట్టి రాధాకృష్ణ మాట్లాడారు.

హాస్టల్‌లో విద్యార్థినులకు వైద్య పరీక్షలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద ఉన్న ఎస్‌టీ మహిళా హాస్టల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డీఎంహెచ్‌వో సమన్వయంతో ఆదివారం విద్యార్థినులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు విద్యార్థినులతో మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలియజేశారు. మెడికల్ ఆఫీసర్ డి.అలేఖ్య, స్టాఫ్‌నర్స్ కె.శారద, ల్యాబ్ టెక్నీషియన్ వై.బాల దుర్గా, ఏఎంఎం రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు కె.బేబి, కె.కరుణతోపాటు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.